# సిత్తాట

"ఆ పరమటి పక్క గుట్టకింద పల్లెలోళ్ళంతా సిత్తాట[1] ఆడే నాయాళ్ళు. ఆ ఊళ్ళకు మనట్టాంటి కట్టం జేసే రైతులు పిల్లనిస్తారా?.... థూ!" అనేవాడు నాయిన. అనడమేగాదు ఊళ్ళోగానీ అటూ యిటూ పక్కూళ్ళలోగానీ యెవరైనా ఆ గుట్ట కింద పల్లెలోళ్ళకు పిల్లనిస్తావుండారని తెలిస్తే, పోయి సేతనయినంత వరకూ అడ్డంపడేవాడు. అదేందో ఆ ఊళ్ళల్లో ఏ ఇంట్లో జూసినాగానీ సిత్తాట ఆడేవాళ్ళేనంట. ఆ ఊళ్ళల్లోని ఆడపిల్లల్ను ఏ వూరయినా ఇచ్చేతప్పుడు, సేసుకొనే వానికి సిత్తాట ఆడేది వొస్తాదా, రాదా ? పెండ్లాన్ని బతికిచ్చుకొంటాడా, లేదా ? అని యిశారిచ్చుకొని గానీ యియ్యరంట. నాయిన సిత్తాట ఆడేవానికి పిల్లనియొద్దంటే, వాళ్ళు అది రానోనికి పిల్ల్యనియ్యొద్దంటారు. తల్చుకొంటే నగొస్తాది.

అట్టాటోళ్ళకు పిల్లనియొద్దని నాయిన ఊరికెనే సెప్పడమే గాదు, అత్తను జేసుకొంటామని రొండు కాండ్ల ఎవసాయం వుండే వాళ్ళొచ్చినా వొప్పుకో లేదు. ఆ రోజు.... ఏట్లో బరిగొడ్లు కాసే పిలకాయల్తో కల్చి గోలిగుండ్లు ఆడుకొంటావుండాడు. ఇంతలోకి బండి పోలయ్య వొగిరిస్తా వచ్చి, "మీ రామతుల్చమ్మ అత్తకు పెండ్లంట, పెత్తనానికొచ్చినారని మా యమ్మ సెప్పిందే" అన్నాడు. ఆ మొయిన గోలిగుండ్లు జోబులో యేసుకోని "మాకు తొత్తును సూనిచ్చిపో'' అని ఆటాడేవాళ్ళు అర్చుతాన్నా యినిపిచ్చుకోకుండా.... ఉరుకో ఉరుకు!

ఇంట్లో కొచ్చి సూస్తే నలుగురు మొగోళ్ళు ఇద్దరాడోళ్ళు అమ్మతో మాట్లాడతా వుండారు. వాళ్ళ నడుమకు బోయి, నడుం మీద సేతులు పెట్టుకొని నిలబడుకోని "పెత్తనానికొచ్చింది యీళ్ళేనామా?" అనడిగినాడు అమ్మను. అందరూ ఒక్కసారి నగిరి. పెండ్లయితే బండ్లు కట్టుకోని ఇంగో పూరికి పోవచ్చుని తనకు సంబరం. అయితే నాయిన ఆ పెండ్లికి ఒప్పుకోలా. వచ్చినవాళ్ళు నాయిన తిడతావుండే గుట్టకింద పల్లెవాళ్ళేనంట.

"ఆ ఇంట్లో పెద్దోడు సిత్తాట అడ్తాడుగానీ పెండ్లి సేసుకోవల్సిన పిల్లోడు ఆడడు గంగిరెడ్డీ, మా మాట యిను" అని వాళ్ళు నెత్తీనోరు కొట్టుకొని సెప్పినా యినకపాయె. "ఆ ఆట ఆడేవాడు వుండే యింటి క్కూడా నా సెల్లెల్ను యియ్యను పోండి" అనె. వాళ్ళు యిసుక్కుంటా పిసుక్కుంటా బోయిరి.

"సిత్తాట అంటే ఏందమ్మా?" అనడిగినాడు అమ్మను. "అదొక ఆటలే...." అనింది అమ్మ.

"ఆటయితే అడ్తే ఏం మల్ల? మేం గోలిగుండ్లు ఆడుకోలా?" అమ్మ నగి, వొళ్ళోకి తీసుకోని "అట్టాటిది కాదులే అది, లెక్కకు ఆడేది" అని సెప్పింది. అప్పుడు ఆ ఆటంటే ఏందో రోంత తెల్చింది.

ఇప్పుడు నాయిన లేడు. అమ్మా లేదు. తను మాత్రం నాయిన బతికినట్టే 'కట్టం జేసే రైతు'గా బతుకుతాండాడు. పెండ్లాం కట్టం జేసేదే, పిల్లలూ జేసేవాళ్ళే. మొత్తంమీద అందరూ కట్టం జేసేవాళ్ళూ, కట్టాలు పడేవాళ్ళూ. ఇప్పుడెప్పుడన్నా యిదో యిట్ట నాయిన గ్యాపకమొచ్చినప్పుడూ, సిత్తాట ఆడేవాళ్ళను

1) ఒక రకం జూదం 2) దొంగను

ఆయన సీదరిచ్చుకోడం తల్చుకొన్నప్పుడూ, ఏడ్సాల్సో, నగాల్సో తెలకుండా వుంటాది. అప్పుడు ఆ పరమటి పక్క గుట్టకింద పల్లెలోళ్లు అంతా యెందుకు సిత్తాట ఆడేవాళ్ళో ఇప్పుడు తెల్చింది. అసలే గుట్టకింద పల్లెలు. వానలు కుర్సవు. వానలు కుర్సనపుడు వాన మీంద నడిసే యెవసాయానికి ఎన్ని ఎకరాలుండి యేం పలం? యెవసాయంలో ఎంత కట్టం సేసీ యేం లాబం? అందువల్లనే వాళ్ళు యెవసాయాన్ని నమ్ముకోకుండా కుటుంబాన్ని బతికిచ్చుకోడానికి ఆ ఆట నేర్సుకున్నారు!

సిత్తాట ఆడడం సరైనపని కాకపోవొచ్చు. అట్టాటి ఆటాడి పెండ్లాం బిడ్డల్ను సాక్కోవాలనుకోడం తప్పుకావొచ్చు. అయితే సరైన యిదంగా బతకడానికి పుర్సతుల్యాకపోతే, మనిసి సరైన ఆలోసనా సెయ్యలేడు, సరిగా బతకనూ లేడు. సరిగా బతకకపోయినా, బతకాలనుకొంటాడు కనక ఎట్ట కుదిర్తే అట్ట బతుకుతాడు. దానికి తప్పుపడ్తే ఏం లాబం? యిప్పుడా గుట్టకింద పల్లెలోళ్ళు ఆడ్తాందారో, ల్యాక అందనా బతకల్యాక దొంగతనాలే సేస్తాందారో తెల్దుగానీ, మనట్టా యెవసాయం జేస్తావుండే వాళ్ళు సేస్తా వుండేదేంది?

తొలీతా ఏరువాక సేద్యాలు మొదలైన కాన్నుంచీ పంట కళ్ళంలోకీ, అక్కన్నుంచీ కంచంలోకీ వచ్చేదాంకా జరిగేకతంతా యేంది? సిత్తాట ఆడేవాడు ఓడిపోతావున్నా యీసారి గెల్చుతానేమో అనుకొంటా వచ్చినట్టే.... యీ యేడు పండుతాదేమో, యీ వాన సక్కరంగా[3] కుర్సుతాదేమో అనుకొంటా వుండాం గదా ! అస్సలుకు యెవసాయం జేయడం సిత్తాట ఆడడం కన్న కనాకట్టం. సిత్తాట ఆడేవాడు ఓడిపోయినా గెల్చినా వాని సేతులారా ఆడతాండాడు. ఆట బాగా ఆడెనా గెల్చుతాడు, లేదా ఓడిపోతాడు. యిదట్టాగాదే ! నువెంత బాగా ఆడినా గెల్చలేవు. ఇదింగో రకం సిత్తాట, సిత్తయిపోయే ఆట! అసలాటే నీ సేతిలో లేదు.

మరెవరి సేతులో వుందబ్బీ అంటే.... ఒక్క సెయ్యని సెప్పలేం. వాన సేతిలో వుండేది సరే అదట్టపోనీయ్.... అదొకటేనా? కొనేతప్పుడు అంతా అమ్మేతప్పుడు ఇంతా వుండే దరల సేతులో, దరలను పెట్టే పెద్దోళ్ళ సేతిలో, 'ఊర్లముందే ఏర్లు పారిపోతాన్నా పైర్లకు నీళ్ళు పెట్టుకోడానికి ల్యాకుండా జేస్తాండే వాళ్ళ సేతిలో.... ఇట్టా ఇందరి సేతుల్లో వుంది. ఎక్కడెక్కన్నో వుండి ఏం సమ్మందం లేని వాళ్ళందరి సేతుల్లో వుందిగానీ, సెమటా నెత్తురూ కార్సి యెల్లకాలం కనిపెట్టుకోని కట్టం సేసేవాడి సేతిలో లేదు యెవసాయం! ఎంత సిత్రం ! ఎంత అన్నాయం!

3) సక్రమంగా